క్లుప్తంగా

బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని నిరసన

ఇల్లంతకుంట: అనంతారం-ఇల్లంతకుంట మధ్య బిక్క వాగుపై బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని అనంతారం గ్రామ యువజన సంఘ సభ్యులు శనివారం బ్రిడ్జిపై కూర్చొని నిరసన తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా వదిలిపెట్టి సంవత్సరాలు కావస్తున్నా పూర్తి చేయడం లేదని యువజన సంఘం సభ్యుడు అక్కెం నాగరాజు అన్నారు. పోలీసులు చేరుకొని నిరసన విరమించాలని కోరారు. ఇల్లంతకుంట ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ హామీ మేరకు విరమించారు.

16న ఏకలవ్య పాఠశాల ప్రవేశ పరీక్ష

కోనరావుపేట: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరోతరగతిలో ప్రవేశానికి ఈనెల 16న పరీక్ష ఉంటుందని మరిమడ్ల ప్రిన్సిపాల్ రామ్‌సూరత్‌యాదవ్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఎల్లారెడ్డిపేటలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో పరీక్ష రాయాలన్నారు.

నేడు విప్ పర్యటన

కోనరావుపేట: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం కనగర్తి, నాగారం గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. కనగర్తిలో అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ, నాగారంలో చౌడమ్మ ఉత్సవాల్లో పాల్గొంటారు.

బాధిత కుటుంబానికి చేయూత

తంగళ్లపల్లి: తాడూర్ గ్రామానికి చెందిన మధుప్రియ గతేడాది జనవరిలో పొలంలో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మరణించింది. విద్యుత్ పంపిణీ సంస్థ సెస్ ద్వారా రూ.5లక్షల పరిహారం బాధిత కుటుంబానికి సెస్ చైర్మన్ చిక్కాల రామారావు శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మధుప్రియ ఇద్దరు పిల్లలకు రూ.2.25లక్షల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్, రూ.50వేలు నగదు నిమిత్తం చెక్కు అందజేసినట్లు పేర్కొన్నారు.

తాటాకు చప్పుళ్లకు భయపడేదే లేదు

తంగళ్లపల్లి: కాంగ్రెస్ నాయకులు చేసే తాటాకు చప్పుళ్లు, బెదిరింపులకు భయపడేది లేదని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు కుర్మ రాజయ్య, సావనపెల్లి పర్శరాములు, సిలివేరి చిరంజీవి, మీసాల కృష్ణ, గుండు ప్రేమ్‌కుమార్, కొయ్యడ రమేశ్, అమర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఇల్లంతకుంట: రహీంఖాన్‌పేట గ్రామానికి ఎంపీ బండి సంజయ్‌కుమార్ రూ.5లక్షల నిధులు కేటాయించగా.. శనివారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. గ్రామంలోని నాలుగో వార్డులో 115 మీటర్ల సీసీ రోడ్డు కోసం ఎంపీ నిధులు కేటాయించారు. బీజేపీ గ్రామ నాయకుడు బత్తిని స్వామిగౌడ్ పనులు ప్రారంభించారు.

యువకుల శ్రమదానం

బోయినపల్లి(చొప్పదండి): స్తంభంపల్లి గ్రామం నుంచి గుండన్నపల్లి గ్రామం వరకున్న మెటల్ రోడ్డు అధ్వానంగా తయారై గుంతలమయమైంది. రోడ్డు మరమ్మతు చేయాలని అధికారులు, నాయకులకు చెప్పినా ప్రయోజనం లేక శనివారం గుండన్నపల్లి శ్రీరామ హిందూ సేవాసమితి ఆధ్వర్యంలో యువకులు శ్రమదానంతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు.

150 మందికి అన్నదానం

వేములవాడ: వేములవాడ రాజన్న గుడి మెట్ల వద్ద పేదలు, భక్తులు 150 మందికి పై వేములవాడ ట్రస్టు ప్రతినిధులు శనివారం అన్నదానం నిర్వహించారు.

నిందితులను శిక్షించాలి

చందుర్తి: జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం నాగునూర్ గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఈనెల 6న రాత్రి చెప్పుల దండ వేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్, బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో ఎస్సై అంజయ్యకు శనివారం ఫిర్యాదు చేశారు.

పద్మశాలీ సంఘం సభ్యత్వ నమోదు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పద్మశాలీ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. అధ్యక్షుడు గోలి వెంకటరమణ, జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలకు మల్కపేట రిజర్వాయర్ నీళ్లు

ఎల్లారెడ్డిపేట: మల్కపేట రిజర్వాయర్ నుంచి 9వ ప్యాకేజీలో భాగంగా కాలువల ద్వారా రైతుల పంట పొలాలకు సాగునీరందిస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్ అన్నారు. కిష్టునాయక్‌తండా, బొంగులకింది తండాల్లోని నీటి కాలువలను శనివారం పరిశీలించారు.

బెదిరింపులకు పాల్పడితే సహించం

ముస్తాబాద్: అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు బెదిరింపు రాజకీయాలకు పాల్పడితే సహించేది లేదని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి అన్నారు. ముస్తాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. శీలం స్వామి, మెంగని మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

హాయ్ హాయ్.. షేరింగ్ జర్నీ

- స్వేచ్ఛగా షికారు.. కస్టమర్ల హుషారు
- బ్లాబ్లా యాప్‌ను వినియోగించుకుంటున్న జిల్లా వాసులు
- సిరిసిల్లలో నయా ట్రెండ్



సిరిసిల్లటౌన్: బిజీబిజీ జీవితంలో జనాలు ఉరుకులు పరుగులతో కాలం గడుపుతున్నారు. తమ విలువైన కాలాన్ని జాగ్రత్తగా వినియోగిస్తున్నారు. ప్రయాణాల్లో ఐతే మరీ జాగ్రత్తగా సమయాన్ని కేటాయిస్తున్నారు. వృత్తిరీత్యా, అత్యవసర ప్రయాణాల కోసం నిర్దీత సమయంలో గమ్యం చేరడానికి టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ఆర్థికంగా ఉన్నవారి మాటటుంచితే.. మధ్యతరగతి కుటుంబాల వారు సొంత వాహనాలను బ్లాబ్లా ద్వారా ఇతర ప్రయాణికులతో జర్నీ షేర్ చేసుకుంటున్నారు. వాహనదారులకు ఖర్చులు కలిసి రావడంతోపాటు ప్రయాణంలో తోడు దొరుకుతుండగా.. కస్టమర్లకు ఈజీ జర్నీతోపాటు ఖర్చులు కూడా కలిసొస్తున్నాయి. గతంలో నగరాలకే పరిమితమైన ఈజీ జర్నీ యాప్ బ్లాబ్లా వంటివి ఇప్పుడు సిరిసిల్ల జిల్లావాసులు కూడా వినియోగిస్తున్న వైనంపై సండే స్పెషల్ స్టోరీ మీకోసం.



సిరిసిల్ల బీవైనగర్‌కు చెందిన రాజుకు సొంతంగా కారు ఉంది. ఇటీవల ఓ ఫంక్షన్ నిమిత్తం కుటుంబ సభ్యులతో హైదరాబాద్ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఒక్కడే ఉండటంతో జర్నీలో తోడు కోసం బ్లాబ్లా యాప్‌ను వినియోగించుకున్నాడు. అల్వాల ప్రాంతం నుంచి ఒక 60ఏళ్ల వ్యక్తి అనారోగ్యంతో ఉండి తన ఫ్యామిలీ డాక్టర్ వద్దకెళ్లాలని బ్లాబ్లాలో రాజు కార్‌లో రావడానికి కన్ఫర్మేషన్ ఇచ్చాడు. రాజు ఆ పెద్ద మనిషిని తీసుకొచ్చి సిద్దిపేటలోని వైద్యుడి వద్ద దింపేశాడు. డబ్బులు కూడా తీసుకోని రాజును ఆ పెద్ద మనిషి ఆశీర్వదించాడు.



సిరిసిల్లలో బ్లాబ్లా యాప్ యూజర్లు

లగ్జరీ ప్రయాణం..

వీకెండ్లు, సాధారణ టూర్లు చేసేవారు, బిజినెస్‌మెన్లకు బ్లాబ్లా వంటి యాపులను ఆశ్రయిస్తున్నారు. చేరుకోవాల్సిన గమ్యం తక్కువ ఖర్చుతోపాటు విలాసవంతమైన కారు ప్రయాణం దక్కడంతో వాటిని ఆదరిస్తున్నారు. గడిచిన ఐదేళ్లుగా హైదరాబాద్, కరీంనగర్ వంటి నగరాల్లో బ్లాబ్లా వంటి యాపుల ద్వారా ప్రయాణికులు అనుకున్న గమ్యానికి ప్రయాణాలు చేసేవారు. ఇప్పుడా ట్రెండు సిరిసిల్ల జిల్లా కేంద్రంతోపాటు వేములవాడ, మిగతా పట్టణాలకు పాకింది. అద్దెకు కార్లను తీసుకెళ్లిన దాని కన్నా ఖర్చులు చాలా తక్కువవడంతో ప్రయాణికులు సంతోషంగా షికారు చేస్తున్నారు. సిరిసిల్ల పట్టణంలో కొందరు యువకులు హైదరాబాద్ తరహాలో ఉపాధి మార్గాన్ని అన్వేషించి సొంతంగా సిరిసిల్లలో బ్లాబ్లా యాప్ ద్వారా ప్యాసింజర్లను కోరిన గమ్యానికి చేరుస్తున్నారు. పలు సందర్భాల్లో బస్సు ప్రయాణ ఖర్చుల కన్నా తక్కువగా రుసుము ఉండటం ప్రయాణికులకు కలిసొస్తోంది.

గమ్యం చేరాకే డబ్బులు చెల్లింపు

బ్లాబ్లా యాప్ ద్వారా ప్రయాణాలు చేసేవారు మొదటగా గూగుల్ ప్లే స్టోర్ ద్వారా యాప్‌ను మొబైల్‌లోకి డౌన్‌లోడ్ చేసుకుంటారు. మొబైల్ నంబరు, మెయిల్ అడ్రస్ ద్వారా యాప్‌లో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. దీంతో కారు యజమానితోపాటు ప్యాసింజర్ వివరాలు యాప్‌లో ఉండటంతో కొంతవరకు రక్షణ ఉంటుందని ప్యాసింజర్లు భావిస్తున్నారు. బ్లాబ్లా ద్వారా ప్రయాణం చేసే వ్యక్తి తాను వెళ్లే గమ్యం దిశగా ఏవైనా వాహనాలు వెళ్తున్నాయో కనుక్కొని రిక్వెస్ట్ పంపిస్తారు. దానిని అందుకున్న వాహనదారుడు కస్టమర్‌కు తాము నిర్ణయించిన లొకేషన్ పాయింట్‌కు రావాలని మెస్సెజ్ ఇచ్చి వారిని తమ జర్నీలో భాగస్వామిని చేసుకుంటారు.

అన్ని విధాలా కలిసొస్తుంది



వారానికి ఒకసారైనా హైదరాబాద్‌కు మాల్ ఖరీదుకు వెళ్తాను. అద్దెకు కారు తీసుకెళ్లినప్పుడు ఖర్చు ఎక్కువయ్యేది. బ్లాబ్లా యాప్ ద్వారా వెళ్లినప్పుడు సుఖవంతమైన ప్రయాణం చేస్తున్నా. ఖర్చులు కూడా పెద్దగా ఉండటం లేదు. సిరిసిల్ల పద్మశాలీ వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు ఎక్కువగా యాప్‌ను వినియోగిస్తున్నారు.

– విశ్వనాథుల భానుచందర్, వ్యాపారి, సిరిసిల్ల

ఆన్‌లైన్‌లో సీట్ బుకింగ్

గతంలో బ్లాబ్లా యాప్‌లు ఇంటర్ సిటీలో సేవలందించేవి. ప్రమోషనల్ సేవలు కావడంతో కస్టమర్, కారు ఓనర్ ఇద్దరికి ఎలాంటి రుసుము ఉండటం లేదు. వైద్య సేవలకు వెళ్లేవారు, ఉద్యోగాలకు వెళ్లేవారు, సాధారణంగా ట్రిప్పులకు వెళ్లేవారు ఈ యాప్‌ను వినియోగిస్తూ ప్రయాణాలు సాగిస్తున్నారు.

– తంగళ్లపల్లి కిషోర్, డ్రైవర్

తక్కువ చార్జీలతో..

వృత్తిరీత్యా బిజీగా ఉంటాను. రిలాక్సేషన్ కోసం చాలా రోజుల నుంచి గోవాకు వెళ్లాలనుకున్న. ట్రిప్‌లో కంపెనీ దొరకక చాలా రోజులు వేచి చూశా. యాప్ గురించి తెల్వగానే హైదరాబాద్ టూ గోవా జర్నీకి బ్లాబ్లా సీట్ బుక్ చేసుకొని వెళ్లిన. మరో ఐదుగురు గోవా ట్రిప్ ఎంజాయ్ చేశారు. ప్రైవేటు ట్రావెల్స్ చార్జీల కన్నా తక్కువ ఖర్చులోనే వెళ్లి వచ్చా.

– ఇప్పకాయల వేణు, సిరిసిల్ల



ఎల్లారెడ్డిపేట: మండలంలోని కోరుట్లపేట శివారు కొండయ్య గుట్ట వద్దున్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు సరఫరాను నిలిపివేశారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని పంట పొలాలు ఎండిపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ నంబర్ వైఆర్‌పేట్ ఎస్ఎస్ఎల్ 31గా ఉంది. బంద్ చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్దే దానికి హ్యాండిల్‌ను కూడా అలాగే వదిలేశారు. ఈ విషయంలో సంబంధిత సెస్ లైన్‌మెన్ వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆన్ చేసి విద్యుత్ సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రమేశ్, లైన్ ఇన్‌స్పెక్టర్, ఎల్లారెడ్డిపేట, సెల్ నంబర్: 9154280477

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

రాజన్న సేవలో మాజీ ఎమ్మెల్యే కుటుంబం



రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు కుటుంబ సభ్యులు

వేములవాడ: వేములవాడ రాజన్నను మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఆయన సతీమణి మరియా, కుమార్తె సంగీత, కాబోయే అల్లుడు మాక్స్‌లతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ప్రధాన ద్వారం నుంచి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకున్నారు. రమేశ్‌బాబు మాట్లాడుతూ.. మహిళ ఉన్నది కాబట్టే మనుగడ సాగుతోందన్నారు. వేములవాడ మాకు కన్నతల్లి లాంటిదని అన్నారు. నాయకులు రామతీర్థపు రాజు, కొండ కనకయ్య, సలీం, విష్ణు, తదితరులున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి సమీపంలోని ఉడిపి హోటళ్లో టిఫిన్ చేశారు.

త్వరలోనే తాము ఏకం కాబోతున్నామంటూ సంతోషంగా ప్రకటిస్తూ జర్మనీకి చెందిన సంగీత–మాక్స్‌లు శనివారం రాజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రమేశ్‌బాబు కూతురు సంగీత జర్మనీలో ఉన్నత చదువులు చదివారు. త్వరలోనే వీరిద్దరూ ఒక్కటవ్వనున్నారంటూ రమేశ్‌బాబు స్వయంగా ప్రకటించారు.



వేములవాడరూరల్: మహిళా సిబ్బందిని సన్మానిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై మారుతి



సిరిసిల్లకల్చరల్: విద్యార్థినులతో మహిళా దంత వైద్యులు



ఎల్లారెడ్డిపేట: పంచాయతీ కార్మికులను సన్మానిస్తున్న నాయకులు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన మహిళా ఉద్యోగులు, కార్మికులను సన్మానించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతోపాటు మహిళలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



సిరిసిల్లటౌన్: డీసీసీ ఆఫీస్‌లో..



చందుర్తి ఠాణాలో మహిళా కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న ఎస్సై, ఏఎస్సైలు, సిబ్బంది



బోయినపల్లి: మహిళా పోలీసులను సన్మానించిన ఎస్సై పృథ్వీధర్‌గౌడ్



వేములవాడఅర్బన్: ఏరియా ఆసుపత్రిలో..



ఇల్లంతకుంట: మహిళా కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, సిబ్బంది



తంగళ్లపల్లి: మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో..



కోనరావుపేట: మామిడిపల్లిలో ఉద్యోగులను సన్మానిస్తున్న నాయకులు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఎల్లారెడ్డిపేట: రాజన్నపేటకు చెందిన నమిలికొండ నూతన్(28) అనే యువకుడు ఇంట్లో సిలిండర్ పొయ్యిపై వంట చేస్తూ కళ్లు తిరిగి వెలుగుతున్న స్టవ్ మీద పడడంతో.. తీవ్ర గాయాలకు గురై చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. రెండు నెలలపాటు హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడి చివరకు మరణించడం గ్రామంలో విషాదం నింపింది. రెండు నెలల క్రితం తన తల్లి ఊరెళ్లడంతో ఇంట్లో వంట చేస్తున్న క్రమంలో చీకట్లు రావడంతో స్టవ్‌పై పడ్డాడు. ఈ ప్రమాదంలో 40 శాతం కాలిపోయిన నూతన్‌ను కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి తల్లి రాజవ్వ, సోదరుడు నరేశ్ ఉన్నారు.

కొడుకు అంత్యక్రియలకు దుబాయ్ నుంచి వచ్చిన తండ్రి

ఇల్లంతకుంట: ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లిన తండ్రి కొడుకు అంత్యక్రియలకు దుబాయ్ నుంచి వచ్చాడు. పెద్ద లింగాపురం గ్రామ యువకుడు శీలం రజనీకాంత్ బైక్ అదుపుతప్పి గురువారం రాత్రి ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావిలో పడి మరణించాడు. లచ్చయ్య విదేశం నుంచి శనివారం తిరిగి వచ్చి కొడుకు దహన సంస్కారాలు నిర్వహించాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

చందుర్తి: మల్యాల గ్రామ శివారులోని వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టుకోగా.. ఓ యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. మల్యాల గ్రామానికి చెందిన పోతురాజు గంగాధర్ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై చందుర్తి నుంచి మల్యాలకు వెళ్తుండగా.. సనుగుల గ్రామానికి చెందిన శివరాత్రి రమేశ్ అనే యువకుడు మల్యాల గ్రామం నుంచి చందుర్తి వైపు వెళ్తున్నాడు. మల్యాల గ్రామ శివారులో ఢీకొట్టుకున్నాయి. శివరాత్రి రమేశ్ స్వల్ప గాయాలతో బయటపడగా.. మల్యాలకు చెందిన పోతురాజు గంగాధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో వేములవాడ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించడంతో హైదరాబాద్ తరలిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మద్యం తాగిన 21 మందికి జరిమానా

ఎల్లారెడ్డిపేట: మండలంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 10 మందికి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 11 మందికి సిరిసిల్ల కోర్టు న్యాయమూర్తి శనివారం జరిమానాలు విధించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. 21 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి విచారణ చేపట్టి ఒక్కొక్కరికి రూ.వేయి చొప్పున జరిమానాలు విధించారు. వాహనదారులు భవిష్యత్‌లో మద్యం తాగి వాహనాలు నడిపితే డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేస్తామని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని ఎస్సై వివరించారు.

వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రం శివారులో ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో శనివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఇద్దరు మద్యం తాగి వాహనాలు నడుపుతుండడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ.. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.

క్రీడాసామగ్రి అందజేత

ముస్తాబాద్: తుర్కపల్లి అంబేడ్కర్ యూత్ సభ్యులకు ప్రేరణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మేడి సురేశ్ వాలీబాల్ కిట్, ఇతర క్రీడాసామగ్రిని శనివారం అందజేశారు.

వైకుంఠ రథం వితరణ



చందుర్తి: పుట్టి పెరిగిన గ్రామానికి తనవంతు సహకారాన్ని అందించాలన్న లక్ష్యంతో గ్రామస్తుల కోరిక మేరకు వైకుంఠ రథాన్ని శనివారం అందించి స్వగ్రామంపై ఉన్న మమకారాన్ని ఎన్నారై చాటుకున్నారు. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కుంట మోహన్ 20 ఏళ్ల క్రితం సౌదీ అరేబియా వెళ్లారు. అక్కడ ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. గ్రామానికి వైకుంఠ రథాన్ని అందించాలని గ్రామస్తులు మోహన్‌ను కోరారు. రూ.3లక్షలతో రథాన్ని తయారు చేయించి మోహన్ తండ్రి కుంట మల్లయ్య జ్ఞాపకార్థం అందజేస్తున్నట్లు ప్రకటించారు.

అకాల వర్షాలు పడొద్దని రైతుల ముడుపు



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని రాగిచెట్టు ఆంజనేయస్వామి ఆలయంలో అకాల వర్షాలు పడొద్దని కోరుతూ రైతులు శనివారం ప్రత్యేక పూజలు చేసి ముడుపు కట్టారు. 50 ఏళ్లుగా ఈ సీజన్‌లో సాగు చేసిన పంటలు రాళ్ల వానకు గురికావొద్దని ఆలయంలో పూజలు చేసి ముడుపులు కడుతున్నారు. పంట చేతికొచ్చిన అనంతరం తిరిగి ఆలయంలో పూజలు చేసి ముడుపు విప్పుతారు.

బీజేవైఎం అధ్యక్షుడిగా రాజశేఖర్

చందుర్తి: బీజేవైఎం మండల అధ్యక్షుడిగా మోతుకుపల్లి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా సిరికొండ తిరుపతిని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు మోకిలే విజేందర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రెడ్డివేణి గోపి తెలిపారు.


వారిపై చర్యలు తీసుకోవాలి

తంగళ్లపల్లి: ఫోన్ చేసి తనను బెదిరించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, జిల్లెల్ల మాజీ సర్పంచ్ మాట్ల మధు అన్నారు. తంగళ్లపల్లిలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సైకి ఫిర్యాదు చేశారు.

టీఆర్ఎస్(డి) జిల్లా అధ్యక్షుడిగా సంపత్

సిరిసిల్లకల్చరల్: నూతనంగా ఆవిర్భవించిన టీఆర్ఎస్(డెమోక్రటిక్) జిల్లా అధ్యక్షుడిగా గుంటక సంపత్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ శనివారం పత్రాన్ని అందజేశారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో శనివారం సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	01	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	05	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	0	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	02	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	04	560
నందీశ్వర సూట్స్	01	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	10	448
పార్వతీపురం స్పెషల్	04	672
పార్వతీపురం సాధారణ	03	336

– వేములవాడ

వైద్యశిబిరానికి స్పందన



ముస్తాబాద్: ముస్తాబాద్ అయ్యప్పస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్యశిబిరానికి భారీ స్పందన వస్తోందని ఎస్ఆర్ఐ డాక్టర్ లక్ష్మణ్‌రావు తెలిపారు. శనివారం వంద మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించామని, ఇందులో 40 మంది వరకు కంటి ఆపరేషన్లు అవసరమున్నట్లు గుర్తించామన్నారు.